క్లుప్తంగా

కుల, మతాలకతీతంగా కలిసి ఉండాలి



రాజాపూర్: గ్రామాల్లో ప్రజలు కులమతాలకు అతీతంగా కలిసి మెలిసి ఉండాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మల్లేపల్లిలో సివిల్‌రైట్స్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నేటికీ ఎక్కడైనా రెండుగ్లాసుల పద్ధతి వంటివి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సోషల్‌వెల్ఫేర్ కన్వీనర్ బాబారావ్, హెడ్‌కానిస్టేబుల్ రాంజీ గ్రామస్తులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం పలువురు భక్తులు అమ్మవారికి అభిషేకం చేయించి ప్రత్యేక అలంకారంలో పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన, సహస్ర లలితా పారాయణం చేశారు. అనంతరం అమ్మవారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు.

ఆర్టీసీ ఉద్యమకారులను ఆహ్వానించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకలకు ఆర్టీసీ ఉద్యమకారులను గుర్తించి ఆహ్వానించాలని.. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు ఎ.రాజసింహుడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సకలజనుల సమ్మెలో ఆర్టీసీ ఉద్యోగులు 27 రోజులు పాల్గొని సీమాంధ్రుల వేధింపులు, అరెస్టులు, అక్రమ కేసులు, జైలు శిక్షలకు గురై ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలకంగా వ్యవహరించి ఎన్నో త్యాగాలు చేశామని గుర్తుచేశారు. తీరా రాష్ట్రం సిద్ధించాక సరైన గుర్తింపునివ్వక నిర్లక్ష్యానికి గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 2న జరిగే దశాబ్ది వేడుకలకు ఆహ్వానించి తగిన ప్రాధాన్యతతో గౌరవించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

గండేడ్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మృతి చెందిన పలువురి అంత్యక్రియలకు ఆయా పార్టీల వారు, చిన్ననాటి మిత్రులు ఆర్థిక సహాయం అందించారు. లింగాయిపల్లిలో తేనెటీగల దాడిలో జీడి వెంకట్‌రాములు మృతి చెందాడు. దీంతో శుక్రవారం కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులతో పాటు చిన్ననాటి స్నేహితులు, ముదిరాజ్ సంఘం, మత్స్యసహకార సంఘం ఆధ్వర్యంలో అంత్యక్రియలకు సాయం అందించారు. అదేవిధంగా వెన్నాచేడ్‌లో తంగి అంజిలమ్మ మృతిచెందగా.. బాధితకుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం కాంగ్రెస్‌నాయులు ఆర్థికసాయం చేశారు. అదేగ్రామంలో పక్కిరి రాజు మృతిచెందగా అంత్యక్రియల నిమిత్తం అంబేడ్కర్ యువజనసంఘం, స్థానికులు ఆర్థికసాయం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, మాజీ సర్పంచులు గోపాల్, వెంకటయ్య, పుల్లారెడ్డి, బీజేపీ నాయకులు బాల్‌రాజ్ , బాలయ్య తదితరులు ఉన్నారు.

కొనసాగిన సామూహిక పూజలు

జడ్చర్ల టౌన్: మండలంలోని గొల్లపల్లి వద్ద 44వ నంబరు జాతీయరహదారిపై ఉన్న లలితాంబికా దేవాలయంలో శుక్రవారం రెండవ రోజు ఉచిత సరస్వతి దేవి సామూహిక పూజలు కొనసాగాయి. లలితాంబికా తపోవన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 5రోజుల పాటు నిర్వహించే సామూహిక పూజల్లో రెండవరోజు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్చరణలతో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తూ సరస్వతి దేవి పూజలు నిర్వహించారు. జూన్ రెండో వారంలో పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నందున చిన్నారుల్లో చదువుపట్ల ఆసక్తి పెంచటానికి సామూహిక పూజలు ఉపయోగపడ్తాయని.. తల్లిదండ్రులు తమ పిల్లలను సామూహిక పూజలకు తీసుకురావాలని అభివృద్ధి కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

సర్వీస్ పొడగింపు సరికాదు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ నాగేంద్రరావు పదవీ విరమణ పొందినా.. ఆయన సర్వీస్‌ను మరో 6 నెలల పాటు పొడగించడం సరికాదని హైదరాబాద్ ఇంజనీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు విజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్. విజయ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పొడగింపుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అవసరమనుకుంటే సలహాదారులుగా నియమించుకోవచ్చని అన్నారు. కానీ అదే పోస్టులో నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

గంటల దేవుడిగా వీరహనుమాన్





స్వామివారి రథము (తేరు), గాధిర్యాల్ వీరహనుమాన్



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

మహమ్మదాబాద్: మండల పరిధిలోని గాధిర్యాల్‌లో కొలువుదీరిన వీరహనుమాన్ భక్తుల పాలిట కొంగుబంగారమై.. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా నిత్యం పూజలందుకొంటున్నాడు. పూర్వకాలంలో విశ్వామిత్రుడి ముని మనవడైన గాధినందనుడే ఇక్కడ తపస్సు చేసి వీరాంజనేయస్వామి విగ్రహం , 40 అడుగుల ఎత్తున్న దివ్యమైన ద్వీపస్తంభాన్ని ప్రతిష్ఠించాడని చరిత్ర చెబుతోంది. ఈ క్రమంలోనే గ్రామానికి గాధిర్యాల్ పేరు వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. ఎంతో మహిమ కలిగిన వీరహనుమాన్ దర్శనం కోసం మండలంలోని వివిధ గ్రామాల ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల వారు కూడా వస్తుంటారు. ఈ క్రమంలోనే ఏటా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తుంటారు. కోరికలు తీరిన భక్తులు గంటలను కట్టి, కోడె మొక్కలు చెల్లించుకుంటారు. ఇక్కడ స్వామిని గంటల దేవుడిగా కూడా కొలుస్తారు.

ఆవు పిడకలతోనే దీపారాధన..

ఇక్కడ వీర హనుమాన్ ఆలయంలో ఆవుపేడతో చేసిన పిడకలతో మాత్రమే ద్వీపస్తంభంపై ద్వీపం వెలిగిస్తారు. అలా తయారైన భస్మాన్నే బొట్టుగా వాడతారు. కాగా ఏళ్ల తరబడి స్వామి వారిని పందిరి కిందే కొలిచేవారు. అయితే 2017లో పరిశుద్ధానందగిరి స్వామి వాక్కు ప్రకారం గుడి నిర్మాణం చేశారు.

ఇంటింటా హనుమాన్ పేరు కలిగిన వారే..

గ్రామంలో దాదాపు ప్రతి ఇంట్లోనూ కనీసం ఒకరిపేరు స్వామి వారిని నిత్యం స్మరించేలా.. హనుమంతు, హనుమయ్య, అంజిలయ్య, అంజిలమ్మ, హనుమమ్మ అంటూ ఉండడం ఇక్కడి ప్రత్యేకత దాదాపు నలభై శాతం వరకు స్వామి నామం వచ్చేలా తమ పేర్లను పెట్టుకుంటుండడం గమనార్హం.

ప్రస్తుతం హనుమాన్ జయంతి సందర్భంగా గత జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. రెండు సంవత్సరాల క్రితం గ్రామస్తులంతా కలిసి స్వంత పొలాల్లో ఉన్న టేకు చెట్ల రథాన్ని చేయించారు. శనివారం తెల్లవారుజామున వైభవంగా రథోత్సవం జరగనుంది.

స్వామివారికి ప్రత్యేక పూజలు

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గాధిర్యాల్‌లో రెండోరోజు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం యాగశాల ప్రవేశం, అభిషేకం, హనుమత్, శ్రీరామ, రుద్ర హోమం చేపట్టారు. అన్నదాన ప్రసాదం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

నేడు హనుమాన్ జయంతి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీ షిరిడిసాయి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకం, పవన హోమం తదితర కార్యక్రమాలు ఉంటాయని.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నిత్యం ప్రత్యేకపూజలు

అత్యంత మహిమగల దేవుడనే నమ్మకంతో గ్రామంలో ఎంతోమంది నిత్యం ఆలయానికి వచ్చి దర్శనం చేసుకుంటారు. ప్రతి శని, సోమవారాల్లో అత్యధికంగా భక్తులు వస్తారు. శ్రావణమాసంలో నిత్యభజనలు, శని, సోమవారాల్లో కూడా భజన తప్పకుండా చేస్తారు. దీంతో భక్తుల రద్దీ పెరిగింది. ఏటా హనుమాన్ జయంతిని గ్రామస్తులంతా ఒక్కటై ఘనంగా నిర్వహిస్తాం. – వెంకట్రాంరెడ్డి, మాజీ సర్పంచ్, గాధిర్యాల్

గ్రామమంతా హనుమాన్ పేర్లే..

గ్రామంలో ఇంటిదేవుడు హనుమంతుడు ఉండటంతో చాలా మందిపేర్లు హనుమంతు, ఆంజనేయులు, హనుమయ్య, హనుమమ్మ, అంజిలమ్మ అంటూ ఎదోరకంగా స్వామిని తలుచుకునే ఆస్కారం ఉండే విధంగా పేర్లు పెట్టుకుంటారు. దాదాపు ప్రతిఇంట్లోనూ ఒకరి పేరు ఈ సంప్రదాయానికి అనుగుణంగా ఉంటుంది. – అంజిలమ్మ, మాజీ సర్పంచ్

ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ తప్పదు



డీపీఓ వెంకటేశ్వర్లుకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ రవి నాయక్, అడిషనల్ కలెక్టర్లు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రతి ఉద్యోగికి పదవి విమరణ తప్పదని జిల్లా కలెక్టర్ రవి నాయక్ అన్నారు. జిల్లా పంచాయతీ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం డీపీఓ వెంకటేశ్వర్లు పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వెంకటేశ్వర్లు అందించిన సేవలు మరువలేనివన్నారు. అడిషనల్ కలెక్టర్లు మోహన్‌రావు, శివేంద్రప్రతాప్‌లు మాట్లాడుతూ వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయిలో తన శాఖ ఉద్యోగులకు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా మార్గనిర్దేశం చేసేవారని తెలిపారు. డీపీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో చాలాకాలం బాధ్యతలు చేపట్టడం తన అదృష్టమని అన్నారు. అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లు దంపతులను అధికారులు వేరు వేరుగా ఘనంగా సన్మానించారు. జెడ్పీ సీఈఓ రాఘవేంద్రరావు, డీఎల్‌పీఓ పండరీనాథ్, ఎంపీఓలు శంకర్, వెంట్రాములు, ఏఓ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తిచేయాలి

మిడ్జిల్: మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఏఎంఓ శ్రీను శుక్రవారం సూచించారు. మున్ననూర్, రాణిపేట్, కొత్తపల్లి గ్రామాల్లో పనులను పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. సీఆర్‌పీ నర్సింహులు ఉన్నారు.

మిడ్జిల్‌లో టీబీ శిబిరం

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం టీబీ శిబిరం నిర్వహించినట్లు వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. మొత్తం 130 మందికి పరీక్షలు చేసినట్లు వివరించారు. అవసరమైన వారికి మందులు సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో ఐసీఎంఆర్ టీం కోఆర్డినేటర్ కుమార్, మల్లేష్, యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు షణ్ముఖశర్మ ప్రవచనం

జడ్చర్ల టౌన్: పట్టణంలో శనివారం ప్రముఖ భాష్యకారులు, ప్రవచనకారులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచన కార్యక్రమం ఉంటుందని.. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రవచన ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు బి. శివకుమార్ శుక్రవారం తెలిపారు. ప్రవచనానికి అధికసంఖ్యలో ప్రజలు హాజరు కావాలని సూచించారు. సాయంత్రం 5గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.

వాకింగ్ పోటీలు

జడ్చర్ల టౌన్: రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని ఫ్లై వాక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక క్రీడామైదానంలో సీనియర్ సిటిజన్స్‌కు 2కే వాకింగ్ పోటీలు నిర్వహించారు. కాగా 25మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే వేసవి శిబిరంలో శిక్షణ పొందుతున్న అథ్లెటిక్స్ క్రీడాకారులకు 50మీ, 100మీ, 400మీటర్ల పరుగుపందెం పోటీలు నిర్వహించారు. పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు అందించనున్నారు.

దుస్తుల పరిశీలన

బాలానగర్: ఉడిత్యాలలో విద్యార్థుల కోసం సిద్ధం చేస్తున్న ఏకరూప దుస్తులను డీఆర్‌డీఓ నర్సిములు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి దుస్తులు అందించాలని అన్నారు. ఎంపీడీఓ శరత్ చంద్ర బాబు, ఏపీఎం నాగరాజు ఉన్నారు.

విజయవంతం చేయాలి

అడ్డాకుల: జూన్ 3 నుంచి 19 వరకు జరిగే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరు కృషి చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో శుక్రవారం అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశంలో మాట్లాడారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ నాగయ్య, ఎంపీఓ విజయ్, ఏపీఎం సుధీర్ పాల్గొన్నారు.

ఘన నివాళి

అడ్డాకుల: వేములకి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ ఉంద్యాల కృష్ణారెడ్డి 2001లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయాడు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని సీఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ బంగారు రాజు, ఏఎస్‌ఐ గోపీ గ్రామానికి వచ్చి కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి తల్లి నీలమ్మను పరామర్శించారు.

అధికారులకు సన్మానం

గండేడ్: మండల ఏఈ రాబర్ట్ శుక్రవారం పదవీవిరమణ పొందారు. ఈమేరకు మహమ్మదాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు అధికారులు తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు. పీఆర్ ఈఈ నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ దేవన్న, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌ఐ తిరుపాజీ, మాజీ డీఎస్పీ సాయిరెడ్డి తదితరులు శుక్రవారం మండల కేంద్రంలో పదవీ విరమణ పొందిన ఏఎస్‌ఐ శ్రీనివాస్‌రావును ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఆర్‌ఐ వెంకట్ రెడ్డి, మాజీ తహసీల్దార్ గిరప్ప పాల్గొన్నారు.

రాజ్యాంగం మార్పునకు కుట్ర



మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలో, దేశంలో నేటికీ సామాజిక అసమానతలు కొనసాగుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ అన్నారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో కేవీపీఎస్ శిక్షణా తరగతులు ప్రారంభించారు. రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేందుకు కుట్ర చేస్తున్నారని అన్నారు. కుటిల ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం శాస్త్రీయ ఆలోచన, రాజ్యాంగం, రిజర్వేషన్లు తదితర అంశాలపై రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎ.రాములు వివరించారు. శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా మల్లెల మాణిక్యం వ్యవహరించారు. జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



అడ్డాకులలో విత్తనాలను పరిశీలిస్తున్న రాజాపూర్ ఏఓ నరేందర్, ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్



నవాబుపేటలో..



రాజాపూర్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

సాక్షినెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా అధికారులు ఆయా మండలకేంద్రాలు తదితర చోట్లు ఉన్న విత్తనాల దుకాణాల్లో శుక్రవారం ముమ్మరంగా తనిఖీలు చేశారు. అడ్డాకుల మండల కేంద్రంలోని విత్తనాల షాపుల్లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేపట్టింది. రాజాపూర్ మండల వ్యవసాయాధికారి నరేందర్, అడ్డాకుల ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్‌లు షాపుల్లో ఉన్న విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. కాలం చెల్లిన విత్తనాలను షాపుల్లో ఉంచుకోవద్దని సూచించారు. అధిక ధరలకు విక్రయించినా, నకిలీ విత్తనాలను విక్రయించినా చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

జడ్చర్లలో శుక్రవారం విత్తన దుకాణాల్లో వ్యవసాయ శాఖ టాస్క్‌ఫోర్స్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలను చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మహబూబ్‌నగర్ అర్బన్ ఏఓ శ్యామ్ యాదవ్, హన్వాడ ఏఓ కిరణ్‌కుమార్, అడ్డాకుల ఏఓ శ్రీనివాస్, గండేడ్ ఏఓ ఫణీషా,సీఐలు ఆదిరెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్ మండల కేంద్రంలోపాటు ఈద్గాన్‌పల్లి, కల్లేపల్లి, తిరుమలాపూర్ గ్రామాల్లోని ఫెస్టిసైడ్, ఫర్టిలైజర్ షాపుల్లో స్థానిక ఎస్‌ఐ రవి, మూసాపేట్ మండల వ్యవసాయశాఖ అధికారి రాజేందర్‌రెడ్డిలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే షాప్‌లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. నవాబుపేట మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో చేపట్టిన తనిఖీల్లో ప్రతి దుకాణంలో స్టాక్ బోర్డు విధిగా పెట్టాలని అధికారులు వ్యాపారులకు సూచించారు. అలాగే స్టాక్‌బోర్డు లేకుండా ఎరువులు విక్రయిస్తున్న ఒక దుకాణం యజమానికి షోకజ్ నోటీస్ ఇచ్చినట్లు అధికారుల బృందం వివరించింది. టాస్క్‌ఫోర్స్ అధికారి రాంగోపాల్, నవాబుపేట ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణకిషోర్ తదితరులు ఉన్నారు.

‘కేసీఆర్‌తోనే తెలంగాణ సాధ్యమైంది’



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తోనే తెలంగాణ సాధ్యమైందని, ఆయన చేసిన పోరాటం వల్లే అన్ని పార్టీలు ముందుకు వచ్చి మద్దతు ఇచ్చాయని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం న్యూటౌన్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌ను తక్కువచేసి చూపించాలనే ప్రయత్నం సరికాదన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పదేళ్ల పాలన సాగిందన్నారు. ఇంటింటికీ నల్లా ద్వారా తాగునీరు అందించామని, రైతులకు పెట్టుబడి, నాణ్యమైన కరెంటు, చివరికి పండించిన పంటలను కొనుగోలు చేశామన్నారు. తమ హయాంలో విత్తనాల కోసం రైతులు ఎప్పుడూ క్యూలైన్‌లో నిల్చోలేదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను 80 శాతం పూర్తి చేశామని, మిగిలిన పనులు వెంటనే చేసి పంటపొలాలకు సాగునీరు అందించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర చిహ్నాల మార్పు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జూన్ 3వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు పార్టీ కార్యాలయాలలో జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు. ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనతో అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు తీయించామన్నారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, రాజేశ్వర్‌గౌడ్, గంజి వెంకన్న, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సుధాశ్రీ

మహబూబ్‌నగర్ రూరల్: ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ సుధాశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లీపూర్ గ్రామంలోని పలు వార్డులలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ సభ దృష్టికి తీసుకువచ్చారు. అల్లీపూర్‌లో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి ఎంపీపీ సూచించారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతి నిధులు సమష్టిగా పని చేస్తూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకుందామని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు చూడాలని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పాలించేందుకు పార్టీలకు అతీతంగా కృషి చేశామని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ కరుణశ్రీతో పాటు వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



బెల్టులు పొందిన విద్యార్థులతో కరాటే మాస్టర్ రవికుమార్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: నెల రోజులుగా జరిగిన వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ఆర్‌కే స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ ఫౌండర్ కె.రవికుమార్ మాట్లాడుతూ కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల శారీరక ధారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని అన్నారు. ఈ పరీక్షల్లో 22 మంది విద్యార్థులు వివిధ బెల్టులు సాధించినట్లు తెలిపారు. 13 మంది ఎల్లో బెల్టు, 2 ఆరెంజ్ బెల్టు, ఒక బ్లూ, ఒక గ్రీన్, రెండు బ్రౌన్ బెల్టు పొందినట్లు తెలిపారు.

భజనలు, కీర్తనలతో చలివేంద్రాల ముగింపు

జడ్చర్ల టౌన్: శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో జడ్చర్ల బస్టాండ్, బాదేపల్లి వాసవీ బుక్‌స్టాల్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శుక్రవారం ముగించారు. గత నెల ఉగాది పర్వదినం రోజున రెండు చలివేంద్రాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ముందుగా నిర్ణయించినట్లుగానే శుక్రవారం వాటిని ముగించారు. ఈ సందర్భంగా సత్యసాయి భజనలు, కీర్తనలు పాడుతు చలివేంద్రాలకు వచ్చిన వారిని ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా సేవాసమితి కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ తమ సేవాకార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ధూమపానానికి దూరంగా ఉండాలి

నవాబుపేట: గుట్కా, పొగాకు, ధూమపానం తదితరాలకు సమాజం దూరంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ నవీన్‌చంద్ర సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాములు, బీచుపల్లాడ్, కలమ్మ, శరభలింగం, రాఘవేందర్, శ్రీనివాస్, అవినాష్, రజిత, వసుంధర, పుష్ప, ఇందిరా తదితరులు ఉన్నారు.

మిడ్జిల్: ప్రజలు సిగరెట్, పాన్ తదితరాలకు దూరంగా ఉండాలని వైద్యాధికారి శివకాంత్ సూచించారు. అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని సబ్‌సెంటర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మరియమ్మ, సిబ్బంది దేవయ్య, సంపత్, జంగయ్య, రాజేశ్వరి, గీతా, తదితరులు ఉన్నారు.

సింగిల్‌విండో ద్వారా సరిపడా విత్తనాలు

భూత్పూర్: సింగిల్ విండో ద్వారా రైతులకు సరిపడ వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార అధికారి ఏ.పద్మ అన్నారు. శుక్రవారం భూత్పూర్, మూసాపేట సింగిల్ విండో కార్యాలయంలో వరి విత్తనాల నిల్వ, క్రయ విక్రయాల రికార్డులను పద్మ పరిశీలించారు. వానాకాలం సీజన్‌లో సింగిల్ విండో ద్వారా రైతులకు ఆర్‌ఎన్‌ఆర్ (15048) 25 కిలోల బ్యాగు రూ. 1098, ఎంటీయూ (1010) 25కిలోల బ్యాగు రూ.988 ధరకు లభిస్తాయన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఫోన్‌నంబర్ తీసుకున్న తర్వాతనే విత్తనాల విక్రయాలు చేపట్టాలని స్థానిక అధికారులకు సూచించారు. బాదేపల్లి డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ జాఫర్, అసిసెంట్ మేనేజర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత జీవితం ఆరోగ్యంగా గడపాలి : ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: క్రమశిక్షణతో కూడిన పోలీస్ శాఖలో పని చేసి ప్రజలకు సేవలు అందించడం గొప్ప విషయం అని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. జిల్లాలో పలు స్టేషన్‌లలో పని చేసి పదవీవిరమణ పొంది ఉమెన్ పీఎస్ ఎస్‌ఐ మహ్మద్ అజీజుల్లా, బాలానగర్ ఏఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఆర్‌ఎస్‌ఐ సాదిక్, టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ ప్రతాప్‌రెడ్డిలను శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత 35నుంచి 40ఏళ్ల పాటు సర్వీస్‌లో ఉండి శాఖకు, ప్రజలకు ఎంతో సేవచేశారన్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలు అందేలా చర్యలు చేపడుతామన్నారు. తమ శేష జీవితం సంతోషంగా గడపాలని, ఏ విధమైన సహాయం కావాలన్నా వెంటనే సంప్రదించాలన్నారు.ఈ అదనపు ఎస్పీ రాములు, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.

మెరుగైన సేవలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో అధికారి ఎ.రవీందర్ పదవీవిరమణ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రాజు మాట్లాడారు. మహబూబ్‌నగర్ బ్రాంచీలో రవీందర్ 15 ఏళ్ల పాటు సేవలందించినట్లు తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి, బ్యాంక్ అభివృద్ధికి విశేష కృషి చేసినట్లు వివరించారు. ఈసందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. సహ ఉద్యోగులు హేమంత్, హమీద్, హన్మంతు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



వినతులను పరిశీలించి పరిష్కరిస్తాం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ డీఎంకు వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరిస్తామని డిపో మేనేజర్ సుజాత తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించి ప్రయాణికుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ డయల్ యువర్ డీఎంకు అనేక వినతులు వచ్చినట్లు తెలిపారు. వినతుల్లో ఎక్కువగా మహబూబ్‌నగర్ నుంచి మరికల్-ఆత్మకూర్, మహబూబ్‌నగర్ నుంచి వడ్డేమాన్-ఆత్మకూర్ బస్సులు నడపాలని ప్రయాణికులు ఫోన్ ద్వారా తెలిపారని, అదే విధంగా మహబూబ్‌నగర్ పట్టణంలో సిటీ బస్సులు నడపాలని కోరినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా వినతులను పరిష్కరించి పరిష్కరిస్తామని తెలిపారు.